


# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలి.

- **ఎంపీ జీ నగేష్**

**ఆదిలాబాద్, మార్చి 20 (డిడి9వార్త ప్రతినిధి ):-**

కాంగ్రెస్ పార్టీ 2023 సంవత్సరం సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీ లు 420 హామీలు వెంటనే అమలు చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, బిజెపి ఆదిలాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్లు డిమాండ్ చేశారు. శుక్రవారం రోజు బిజెపి అధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని, రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని, వేల కోట్ల రూపాయిల కేంద్రం నిధులతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల జరుగుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాన్ని కార్యాలయాల్లో పెట్టాలని డిమాండ్ చేశారు.ఆదిలాబాద్‌లోనిజిల్లాకలెక్టర్కిపార్టీఅధ్వర్యంలో వినతి పత్రంఅందజేసి అనంతరం విలేకరులతో మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం ఐనదని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన పార్టీ క్షమాపణ చెప్పి వెంటనే హామీలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.






# జాతీయ స్థాయి కళారత్న పురస్కారం 2026 అందుకున్న 'కవి 'విశ్రాంత ఎంపీడీఓ చట్ల గజ్జారం.

**బజార్ హత్నూర్,మార్చి 20,(డిడి 9వార్త )**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉగాది సందర్భంగా "వెన్నెల డాన్స్ అకాడమీ నిర్మల్ "డైరెక్టర్ ఎ. ధనరాజ్ నేతృత్వంలో ఎంతో వైభవంగా నిర్వహించిన "పరాభవ నామ ఉగాది" వేడుకల్లో భాగంగా "కవిత్వ కేటగిరీ"లో నిర్మల్ కు చెందిన 'కవి' విశ్రాంత ఎంపీడీఓఅయిన చట్ల గజ్జారాంకు "జాతీయస్థాయి కళారత్న పురస్కారం2026"వరించింది.ఈ పురస్కారం మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా ఆయనకు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా గజ్జారాం సంతోషం వ్యక్తం చేస్తూ వెన్నెలడాన్స్ అకాడమి నిర్మల్ డైరెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.




# బోధన్‌లో సినీ ఫక్కీలో చోరీ

- **కారు అద్దాలు పగులగొట్టి రూ. 3 లక్షల అపహరణ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలో పట్టపగలే దొంగలు బీభత్సం సృష్టించారు. సినిమా ఫక్కీలో కారు అద్దాలు పగులగొట్టి, లోపల ఉన్న రూ. 3 లక్షల నగదును తస్కరించారు. ఈ ఘటన బోధన్ లో తీవ్ర చర్చనీయాంశమైంది. జాడి జమాల్‌పూర్ గ్రామానికి చెందిన హరిబాబు అనే వ్యక్తి తన వ్యవసాయ భూమి కొనుగోలు నిమిత్తం నగదు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా బోధన్ పట్టణంలోని రుద్రూర్ వెళ్లే రహదారి పక్కన ఉన్న కెనరా బ్యాంక్ నుంచి రూ. 3 లక్షలు విత్‌డ్రా చేశారు. ఆ నగదును ఒక కవరులో పెట్టి తన కారులో ఉంచుకుని, మరికొంత నగదు కోసం గోశాల రోడ్డులోని యూనియన్ బ్యాంకు వద్దకు చేరుకున్నారు. బ్యాంకు వెలుపల రోడ్డు పక్కనే కారును నిలిపి, పని ముగించుకుని వచ్చేలోపు దుండగులు తమ చేతివాటం ప్రదర్శించారు. హరిబాబు తిరిగి వచ్చి చూసేసరికి కారు అద్దాలు పగిలి ఉండటం చూసి నిర్ఘాంతపోయారు. కారులో భద్రపరిచిన రూ. 3 లక్షల నగదు కవరు మాయమవ్వడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హరిబాబు కెనరా బ్యాంకులో నగదు డ్రా చేసినప్పటి నుంచే దుండగులు ఆయనను వెన్నంటి వచ్చి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. బ్యాంకు లోపల ఎవరైనా అనుమానితులు నిఘా పెట్టారా? లేదా బైక్‌పై వెంబడించారా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. పది నిమిషాల వ్యవధిలోనే ఈ చోరీ జరగడం చూస్తుంటే, ఇది పక్కా ప్లాన్‌తో జరిగినట్లు అర్థమవుతోంది. ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ వెంకటనారాయణ పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బ్యాంకు పరిసరాల్లోని, గోశాల రోడ్డులోని సిసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు సేకరిస్తున్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టారు. పట్టపగలే రద్దీగా ఉండే ప్రాంతంలో ఇలాంటి దోపిడీ జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.



# ఉపాధి హామీ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మార్చి : 20 ( డిడి9వార్త ప్రతినిధి ) :-**

ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ వ్యయం, వివిధ పెండింగ్ పనుల పురోగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మండలం, విభాగం వారీగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వినియోగించుకుంటూ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, నిధుల వ్యయంలో పారదర్శకత ప్రదర్శించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరామ్, ఏఈఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రతి ఒక్క పోలీసు నిజాయితీతో వ్యవహరించాలి.

- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ .**

**ఆదిలాబాద్, మార్చి : 20 (డిడి9వార్త ప్రతినిధి ):-**

సాయుధ పోలీసు సిబ్బందికి క్రమశిక్షణతో పాటు, నిజాయితీ తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. స్థానిక పోలీసు సాయుధ ముఖ్య కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ ఆకస్మికంగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ విధులలో నిర్లక్ష్యాన్ని వహించకూడదని తెలిపారు. సిబ్బంది కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలి అని, విధులలో సమయపాలన పాటిస్తూ ఉండాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, విధులకు అనవసరంగా గైర్హాజరైన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సాయుధ కార్యాలయంలో ఉన్నటువంటి ప్రతి ఒక్క ఆయుధాన్ని పూర్తిగా శుభ్రపరుస్తూ ఉండాలని తెలిపారు. యువ పోలీసులకు సాంకేతికపరమైన విధులను కేటాయించడం జరుగుతుందని, ఉత్సాహం ఉన్నవారికి సంబంధిత విభాగాలలో విధులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు సాయుధ పోలీసులు సంసిద్ధంగా ఉంటూ ఎల్లవేళలా అప్రమత్తమై ఉండాలని సూచించారు. సిబ్బంది వారికి ఉన్నటువంటి సెలవు దినాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బంది విధులను రొటేషన్ పద్ధతిలో నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలీసు సిబ్బందికి ప్రతి ఒక్కరికి విడతల వారీగా సమానమైన విధులు కేటాయించి, ఎలాంటి భేద భావాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టీ మురళి, ఎన్ చంద్రశేఖర్, రిజర్వ్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కానిస్టేబుల్ కుమారుడి కృషి అభినందనీయం

**నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

పోలీస్ సిబ్బంది పిల్లలు కష్టపడి చదివి ఉన్నత వృత్తుల్లో స్థిరపడటం సమాజానికి, శాఖకు గర్వకారణమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పేర్కొన్నారు. జిల్లా సి.సి.ఎస్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రవికృష్ణ కుమారుడు బి.రజనీకాంత్ హోమియోపతి వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా శుక్రవారం కమీషనర్ కార్యాలయంలో సీపీ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సాధారణ కానిస్టేబుల్ కుటుంబం నుంచి వచ్చి డాక్టరుగా ఎదిగిన రజనీకాంత్ కృషిని కొనియాడారు. పోలీస్ సిబ్బంది పిల్లల ఉన్నత చదువులకు, వారి ఉజ్వల భవిష్యత్తుకు తమ శాఖ నుండి ఎల్లప్పుడూ పూర్తి సహకారం, భరోసా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.




# ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం – TGJLA 475 ఆదిలాబాద్ హర్షం.

**బజార్ హత్నూర్,మార్చి 20,(డిడి9వార్త ప్రతి-నిధి ):-**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రకటించడం పట్ల తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (TGJLA 475), ఆదిలాబాద్ జిల్లా విభాగం హర్షం వ్యక్తం చేసింది. ఇంటర్మీడియట్ విద్యాధికారి ఆదిలాబాద్ జాదవ్ గణేష్ కుమార్ మాట్లాడుతూ ఈ పథకం అమలు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు రెండు లక్షల మంది విద్యార్థులకు నేరుగా లాభం చేకూరుతుందని ఆయన వివరించారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యను కొనసాగించడంలో ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడమే కాకుండా, వారి శారీరక ఆరోగ్యం & మానసిక వికాసానికి కూడా ఇది దోహదపడుతుందని తెలిపారు. సరైన ఆహారం అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులు తరగతుల్లో మరింత చురుకుగా పాల్గొని, విద్యలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు .ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు చట్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకుమధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. గత సంవత్సరమే ఈ అంశాన్ని సంఘం రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు, అలాగే విద్యాశాఖ అధికారులతో పాటు సంబంధితఉన్నతాధికారులకు ఈ పథకం అవసరాన్ని వివరించినట్లు తెలిపారు. ఇంకా, ఈ పథకం అమలుతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల పట్ల విద్యార్థులు & తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరుగుతుందని, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి ఇది ఒక కీలక అడుగుగా నిలుస్తుందని తెలిపారు. మొత్తంగా, తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఒక అభినందనీయమైన చర్యగా TGJLA 475 ఆదిలాబాద్ శాఖ పేర్కొంటూ, ఈ పథకాన్ని త్వరితగతిన సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల బెల ప్రిన్సిపాల్ భగవాన్లు, TGJLA 475 రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేందర్,రాష్ట్ర కౌన్సిలర్ రాథోడ్ శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్స్ అశోక్ రెడ్డి, డాక్టర్ కొండ గోవర్ధన్, ఉపాధ్యక్షులు రవికాంత్, జిల్లా ముఖ్య నాయకులు నరేష్, సురేష్ ,నరేందర్ రెడ్డి, సుభాష్ ,ఐలయ్య , అనిల్, రమేష్, జనార్దన్ రెడ్డి, గుట్టే బాలాజీ, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# భక్తిశ్రద్ధలతో రంజాన్ జరుపుకోవాలి: సీపీ సాయిచైతన్య

**నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ముస్లిం సోదరులకు, జిల్లా ప్రజలకు పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య శుభాకాంక్షలు తెలిపారు. శనివారం జరగనున్న పండుగ వేడుకల దృష్ట్యా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని ఆయన వెల్లడించారు. శుక్రవారం ఆయన ఆర్మూర్, మాక్లూర్ ప్రాంతాల్లో పర్యటించి భద్రతను పర్యవేక్షించడంతో పాటు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈద్గాల వద్ద ఏర్పాట్ల పరిశీలన సామూహిక ప్రార్థనలు జరిగే ఈద్గాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ వద్ద గల ఈద్గాను ఆయన సందర్శించి, భద్రత, పార్కింగ్ వసతులపై అధికారులతో చర్చించారు. ప్రార్థనల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, పార్కింగ్ ప్రాంతాల్లో తగినంత మంది సిబ్బందిని నియమించాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. నిర్వాహకులతో మాట్లాడి ప్రార్థనల సమయం, భక్తుల రద్దీపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఆధ్యాత్మికంగా ఇఫ్తార్ విందు**

మాక్లూర్ మండల కేంద్రంలోని అరిఫా ఫాతిమా మసీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మసీద్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక దువాలో పాల్గొని, అనంతరం ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం విశిష్టతను కొనియాడారు. రంజాన్ అంటే కేవలం ఉపవాసాల నెల మాత్రమే కాదు.. మనసును శుద్ధి చేసుకునే ఆత్మపరిశీలన సమయం. ఉపవాసం ద్వారా సహనం, క్రమశిక్షణ అలవడతాయి. దానధర్మాలు, సోదరభావం వంటి విలువలు ఈ పవిత్ర మాసంలో మరింతగా పెంపొందుతాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి, సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాక్లూర్ ఎస్సై ఎం.రాజశేఖర్, మసీద్ కమిటీ సభ్యులు ఎండీ అహ్మద్, తాజుద్దీన్, అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.





# భక్తిశ్రద్ధలతో ఈద్ జరుపుకోవాలి నిజామాబాద్ జిల్లా యంత్రాంగం

**నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**



పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణకు, దానగుణానికి మరియు ఆధ్యాత్మికతకు మారుపేరైన రంజాన్ మాసం సమాజంలో శాంతిని పెంపొందించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కఠినమైన ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలితో నెల రోజుల పాటు సాగిన ఆధ్యాత్మిక యజ్ఞం ముగింపు పర్వమైన ఈద్-ఉల్ ఫితర్ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజల మధ్య సోదరభావం, మతసామరస్యం వెల్లివిరియాలని, పేదరికం లేని సమాజం దిశగా అందరూ పయనించాలని ఆకాంక్షించారు. శనివారం జరుపుకోనున్న ఈద్ నమాజ్‌ను ముస్లిం సోదరులందరూ భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకోవాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం తరపున ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# సారంగాపూర్‌లో పేకాట స్థావరంపై దాడి

- **ఐదుగురు జూదరుల అరెస్ట్..**
- **నగదు, సెల్‌ఫోన్లు, వాహనాలు స్వాధీనం**

**నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగర శివారులోని సారంగాపూర్ మిషన్ భగీరథ ప్రాంతంలో సాగుతున్న పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు శుక్రవారం మెరుపు దాడి చేశారు. జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ మస్తాన్ వలీ పర్యవేక్షణలో ఈ సోదాలు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ వద్ద పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో సీసీఎస్ బృందం తనిఖీలు చేపట్టింది. ఈ దాడిలో ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 11,170 నగదుతో పాటు 4 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని భీంగల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని బాబానగర్ గ్రామంలో పర్యటించి, పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ నర్సరీని సందర్శించిన ఎంపీడీఓ, అక్కడ మొక్కల పెంపకం తీరును పరిశీలించారు. నర్సరీ నిర్వహణతో పాటు పశువుల షెడ్డు పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వనమహోత్సవం గ్రీన్ డేలో భాగంగా నాటిన మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్న తీరును పర్యవేక్షించారు. వేసవి దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రై డే సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతూ.. ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మంజూరైన పనులను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.





# పోలీస్ స్టేషన్‌లో ప్రజాపాలన తనిఖీ

- **మోపాల్ ఠాణాను సందర్శించిన సీపీ సాయి చైతన్య**
- **పెట్రోలింగ్ వాహనాల కండిషన్‌పై ఆరా.. సిబ్బందికి కీలక ఆదేశాలు**

**నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

ప్రజలకు చేరువగా పోలీస్ సేవలను అందించడమే లక్ష్యంగా సాగుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శుక్రవారం మోపాల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రికార్డుల నిర్వహణ నుంచి క్షేత్రస్థాయిలో భద్రతా చర్యల వరకు అన్ని అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించి, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా పనిచేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన బొలెరో, పెట్రోలింగ్ వాహనాల పనితీరును సీపీ స్వయంగా పరిశీలించారు. పెట్రోలింగ్ వాహనాల్లో ఉండే ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను తనిఖీ చేసి, అందులో ఉండాల్సిన సామాగ్రిపై ఆరా తీశారు. అత్యవసర సమయాల్లో వాహనాలు ఎల్లప్పుడూ కండిషన్‌లో ఉండాలని, మొరాయించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ సౌత్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సురేష్ కుమార్, ఎస్సై జెడ్.సుస్మిత, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.






# కొప్పర్తి క్యాంప్‌లో మహిళా సంఘం భవనానికి మార్కింగ్

**బోధన్, నిజామాబాద్ 20 మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర మండలంలోని కొప్పర్తి క్యాంప్‌లో గ్రామీణ స్వయం సహాయక సంఘం భవన నిర్మాణానికి శుక్రవారం అధికారులు మార్కింగ్ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.10 లక్షల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, సంఘం సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తమ గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల మహిళా సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శివ, గ్రామ సర్పంచ్ ఎం.సతీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# మాజీఎమ్మెల్యే అజ్మీరాగోవింద నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపి జి నగేష్

**బజార్హత్నూర్, మార్చి 20(డిడి9వార్త ):-**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్ నాయక్ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని శుక్రవారం రోజు ఉమ్మడి ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సభ్యులు గోడం నగేష్ ఆయన సొంత గ్రామం అయిన దండేపల్లి మండలం లింగాపూర్కు వెళ్లి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.గోవింద్ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను మృతికి గల కారణాలు,వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎంపీతో పాటుగా సీనియర్ నాయకులు సత్యనారాయణ గౌడ్, జాదవ్ రమేష్ తదితరులు ఉన్నారు.



# రాత్రిపూట తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న కోటగిరి మండల ఎస్సై సునీల్

**పొతంగల్ మార్చి 20(డిడి9వార్త):**

నిజాంబాద్ జిల్లా పొతంగల్ మండల కేంద్రంలో రాత్రిపూట అక్రమ రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు ట్రాక్టర్ల నంబర్లుTS 16UB224. TG16T5043 రెండు టాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ట్రాక్టర్లు పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు ఎవ్వరైనా సరే అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కోటగిరి మండలం ఎస్సై సునీల్ తెలియజేశారు.






## బాటసారుల దప్పిక తీర్చేందుకే చలివేంద్రం

- **ఏకచక్ర సేవా సమితి ఆధ్వర్యంలో ప్రారంభం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏకచక్ర సేవా సమితి చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖులు పేర్కొన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గల జాతీయ జెండా సమీపంలో ఏకచక్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పట్టణ వార్డు కౌన్సలర్లు శరత్ రెడ్డి, దాము లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరుగుతున్న ఎండల దృష్ట్యా బాటసారుల కోసం ప్రతి ఏటా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సేవా సమితి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏకచక్ర సేవా సమితి అధ్యక్షుడు అంకు మహేష్, గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్, లక్ష్మణ్ పటేల్, చల్ల శ్రీనివాస్, సంగం శ్రీనివాస్, ఆనంద్, జీవన్ సింగ్, సంతోష్, రాజు, పమ్ము సేటు, జమిని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సాలూరలో రైతులకు ఆధునిక యంత్రాల పంపిణీ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా రైతులకు సాగు ఖర్చులు తగ్గించి, ఉత్పాదకతను పెంచవచ్చని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం సాలురా మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ పథకం కింద రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాలూర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చిద్రపు అశోక్, జిల్లా కాంగ్రెస్ ప్రతినిధి అల్లే రమేష్ హాజరై వారు మాట్లాడుతూ.. రైతులు సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక యంత్రాలను వినియోగించుకోవాలని, తద్వారా సమయం మరియు పెట్టుబడి ఆదా అవుతాయని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇటువంటి రాయితీ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులైన రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాలురా సర్పంచ్ సోక్కం లావణ్య, నాయకులు శంకర్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.






## మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

- **మొయినాబాద్‌లో భగీరథ పనుల ప్రారంభం**

**మొయినాబాద్ మార్చి 20(డీడీ9 వార్త):**

మొయినాబాద్ మున్సిపాలిటీ 16వ వార్డ్‌లో మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ పనులకు కౌన్సిలర్ జంగం గీత వనజాక్షి సంజీవరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ సోనీ దర్శన్ హాజరై పనులను ప్రారంభించారు. వైస్ చైర్మన్ రాజు, కౌన్సిలర్ మమత మోహన్ రెడ్డి, పావని జగన్మోహన్ రెడ్డి, అరుణ రామకృష్ణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సరికొండ అంత్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సంజీవరావు, యాదయ్య, పి. కుమార్, విజయనగర్ కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.








# ఆరోగ్యమే.. చదువుకు ప్రాణం

- **విద్యార్థినులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి**
- **నిర్లక్ష్యం వహించకుండా పరీక్షలకు సిద్ధమవ్వాలి**
- **జ్యోతిబాపూలే గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువు, క్రీడలు, ఇతర అంశాలపై చక్కగా దృష్టి సారించవచ్చు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. మాక్లూర్ మండలం దాస్ నగర్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్యారోగ్య శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. చెత్తాచెదారం, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక స్వచ్ఛ ఆటో'ను పాఠశాలకు కేటాయించాలని ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం వంటగదిను తనిఖీ చేసి, నిల్వ ఉంచిన సరుకులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు వడ్డించే ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తాజా కూరగాయలు మాత్రమే వాడాలని స్పష్టం చేశారు.

**పరీక్షల వేళ.. ఆందోళన వద్దు**

వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థినులు ఎలాంటి ఒత్తిడికి లోనుకావద్దని కలెక్టర్ సూచించారు. సరైన ఆహార నియమాలు పాటిస్తూ, తగినంత నిద్ర ఉండేలా చూసుకోవాలి. సానుకూల దృక్పథంతో, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని మార్గనిర్దేశం చేశారు. ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే వెంటనే నిర్వాహకుల దృష్టికి తీసుకురావాలని, అశ్రద్ధ చేయకూడదని చెప్పారు. బాలికల భద్రత, రక్షణ విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని పాఠశాల నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. బయటి వ్యక్తులు ఎవరూ పాఠశాల లోనికి రాకుండా కఠినంగా వ్యవహరించాలని, నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్వేత, పాఠశాల ప్రత్యేక అధికారి స్వప్న, వైద్యులు సందీప్, శశిధర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.






# వడగళ్ల వాన.. బాచంపల్లి రైతన్న కన్నీరు

- **చేతికొచ్చిన పంట నేలపాలు.. 200 ఎకరాల్లో వరి నష్టం**

**నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

ప్రకృతి వైపరీత్యం అన్నదాతను నిలువునా ముంచేసింది. కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వడగళ్ల వాన రూపంలో మృత్యువు విరుచుకుపడింది. భీమగల్ మండలం బాచంపల్లి గ్రామంలో నిన్న రాత్రి కురిసిన భారీ వడగళ్ల వానకు వందలాది ఎకరాల్లో వరి పంట తుడిచిపెట్టుకుపోయింది. ధాన్యం గింజలన్నీ రాలిపోయి, కేవలం గడ్డి మాత్రమే మిగిలింది. దీంతో రైతులు గుండెవిసివి ఏడుస్తున్నారు. బాచంపల్లి గ్రామ పరిధిలో సుమారు 150 నుంచి 200 ఎకరాల్లో వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. రాత్రి ఒక్కసారిగా కురిసిన వడగళ్ల వానకు గింజలన్నీ నేలరాలిపోయాయి. మరో రెండు రోజుల్లో కోతలు మొదలుపెడదామనుకున్నాం.. ఇంతలోనే సర్వం కోల్పోయాం అని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒక్కో రైతు ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు కనీసం కోత ఖర్చులు కూడా వెళ్లేలా లేవని వాపోతున్నారు. ఒక రైతు తన 10 ఎకరాల్లో పండించిన పంట మొత్తం రాలిపోవడం చూసి తట్టుకోలేకపోతున్నాడు. సుమారు మూడు లక్షల రూపాయల







అప్పు తెచ్చి సాగు చేశాను. ఇప్పుడు అప్పు ఎలా తీర్చాలి? పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు ఎలా గడవాలి? ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోకపోతే పురుగుల మందు తాగి చావడం తప్ప మరో మార్గం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. బాచంపల్లి రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. శుక్రవారం ఉదయం మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈఓ అరవింద్ గ్రామంలో పర్యటించారు. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 68 ఎకరాల్లో నష్టం జరిగినట్లు జిల్లా కార్యాలయానికి నివేదిక పంపారు. అయితే రైతులు మాత్రం నష్టం 200 ఎకరాల వరకు ఉందని వాదిస్తున్నారు. కేవలం 33 శాతం నష్టాన్ని ప్రామాణికంగా తీసుకోకుండా, దెబ్బతిన్న ప్రతి ఎకరాకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి




అప్పుల ఊబిలో ఉన్న అన్నదాతను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. యుద్ధ ప్రాతిపదికన నష్టాన్ని అంచనా వేసి, ఎకరాకు కనీసం రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలని, అప్పుల మాఫీ చేయాలని బాచంపల్లి గ్రామ రైతాంగం డిమాండ్ చేస్తోంది.

# ఎండల వేళ ఎక్స్‌పైరీ దందా

- **వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం!**

**నిజామాబాద్ జిల్లా 20 మార్చి(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లాలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతుండటంతో దాహం తీర్చుకునేందుకు సామాన్యులు శీతల పానీయాలపై ఆధారపడుతున్నారు. అయితే ఇదే అదనుగా భావించిన కొందరు స్వార్థపరులైన వ్యాపారులు కాలం చెల్లిన కూల్ డ్రింక్స్‌ను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. నిజామాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ అక్రమ విక్రయాలు వెలుగులోకి వస్తున్నా, సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో పెరిగిన ఈ దోపిడీని అరికట్టాలని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ చైర్మన్ డాఖా దుర్గాప్రసాద్ విజ్ఞప్తి చేశారు.





